14న తుంగభద్ర నీటిపారుదల సలహా కమిటీ సమావేశం

బళ్లారి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నీటిపారుదల సలహా కమిటీ సమావేశం ఈ నెల 14న బెంగళూరులో జరగనుందని కమిటీ అధ్యక్షుడు శివరాజ్ తంగడిగె సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుంగభద్ర జలాశయంలో నీటి లభ్యత, ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ, తుంగభద్ర డ్యాం నుంచి రబీకి నీరు వదిలేది, లేనిది నూతన క్రస్ట్ గేట్ల ఏర్పాటుపై సమావేశంలో చర్చిస్తామన్నారు. విధానసౌధ 3వ అంతస్తులోని జలమండలి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జలవనరుల శాఖ మంత్రి, డీసీఎం డీకే శివకుమార్, ఇంజనీర్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు.

మమకారాగారం



- పైసలిస్తే సకల సౌకర్యాలు ● బర్త్‌డే పార్టీలు, మొబైల్‌ఫోన్లు ● ఏవి కావాలన్నా క్షణాల్లో..
- పరప్పన అగ్రహార జైలులో విలాసాలపై బీజేపీ ధ్వజం ● సీఎం రాజీనామాకు డిమాండ్



నిరసనలో పాల్గొన్న బీజేపీ ముఖ్య నేతలు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

బెంగళూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్‌జైలులో విలాసాలపై బీజేపీ భారీ నిరసన చేపట్టింది. సోమవారం ఫ్రీడంపార్కులో చేపట్టిన ఆందోళనలో జైలులో ఉండే ఖైదీలు, విచారణా నిందితులు బర్త్‌డే పార్టీలు చేసుకోవడంతో పాటు ఉగ్రవాదుల చేతిలో ఫోన్‌లు ఉండటం జాతీయ భద్రతకు భంగం కాదా అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిపక్షనేత అశోక్, పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర సహా పలువురు నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. నిరసన శిబిరంలో విజయేంద్ర మాట్లాడుతూ పరప్పన జైలు కాదని విలాసవంతమైన బార్ అండ్ రెస్టారెంట్‌గా మార్చారన్నారు. జైలులో ఖైదీలు పార్టీలు చేసుకుంటున్నారని మొబైల్స్ వాడుతున్నారన్నారు. ఇంతకంటే వైఫల్యం మరొకటి ఉంటుందా అంటూ ప్రశ్నించారు. జైలును విలాస కేంద్రంగా మార్చిన ఘనత ప్రభుత్వ పెద్దలకే చెల్లుతుందన్నారు. జైలులో జరిగే ఘోరమైన కృత్యాల వీడియోలు బహిరంగమైన తర్వాత విచారణలు, సమీక్షలంటూ హడావుడి చేస్తున్నారన్నారు. ఖైదీలకు టీవీలు, ఫోన్లు మద్యం ఎలా చేరుతోందని ప్రశ్నించారు. ఇంతకూ ప్రతి దానికి ఓ రేటు ఉంటుందనే అంశం బహిరంగమైందన్నారు.



ప్రతిపక్షనేత అశోక్‌ను బస్సులోకి ఎక్కిస్తున్న పోలీసులు

● ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, హోంమంత్రి పరమేశ్వర్ ఇప్పుడు హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. హాట్‌లైన్ నుంచి పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లకు ఫోన్‌లు వెళుతున్నాయని రెండేళ్ళుగా చర్యలు తీసుకోకుండా గాడిదలు కాస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటెలిజెన్స్ విభాగం ఏంచేస్తోందన్నారు. పోలీసుస్టేషన్‌లను కాంగ్రెస్ కార్యాలయాలుగా మార్చేశారన్నారు.

● పరిషత్ ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి మాట్లాడుతూ ఉగ్రవాదులు ఉండే జైలులో అన్ని సౌలభ్యాలు కొనసాగుతున్నాయంటే వారు ఇక్కడి నుంచే ఎంతటి దారుణాలకైనా పాల్పడవచ్చు అన్నారు. సీఎం, డీసీఎంల చిత్రాలతో పలు విధాల ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం సీఎం ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించగా పోలీసులు ప్రతిపక్షనేత అశోక్, పార్టీ అధ్యక్షుడు విజయేంద్రతో పాటు సీటీ రవి, ఛలవాది నారాయణస్వామి, ఎమ్మెల్యేలు గోపాలయ్య, ఉదయ్ బి గరుడాచార్, అశ్వత్థనారాయణ, సీకే రామమూర్తి, మునిరాజు ధీరజ్ మునిరాజ్ సహా పలువురిని పోలీసులు అరెస్టు చేశారు.

కుమార సభకు గైర్హాజరు

- సీఎం సిద్దరామయ్య సమావేశాల్లో బిజీ
- జేడీఎస్ ఎమ్మెల్యే జీటీ దేవెగౌడపై వేటుకు పార్టీ సిద్ధం



బెంగళూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీ అగ్రనేతలు దేవెగౌడ, కేంద్రమంత్రి కుమారస్వామి నుంచి దాదాపు రెండేళ్ళ కాలంగా దూరంగా ఉంటూ వచ్చిన కీలక నేత, హామీల కమిటీ అధ్యక్షుడిపై వేటుకు రంగం సిద్ధమైంది. తాజాగా ఈ నెల 7న కేంద్ర మంత్రి కుమారస్వామి జిల్లా అభివృద్ధితో పాటు దిశా సభకు జీటీ దేవెగౌడ గైర్హాజరయ్యారు. కానీ సీఎం సిద్దరామయ్య మైసూరులో నిర్వహించే ప్రతి సభలోనూ ఆయన బిజీగా గడుపుతుంటారు. జేడీఎస్ పార్టీ ఏర్పడి 25 ఏళ్ళు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ప్రత్యేక సభ జరపాలని తీర్మానించారు. అందుకోసం ఏర్పాటు చేసిన కోర్‌కమిటీ నుంచి జీటీ దేవెగౌడ పేరును తప్పించారు. కానీ జీటీ దేవెగౌడ కుమారుడు జేడీఎస్‌లోనే ఎమ్మెల్యేగా కొనసాగుతూ క్రియాశీలకంగా ఉండటం విశేషం. 2018లో ఉన్నత విద్యాశాఖామంత్రి పదవి వద్దని వేడుకున్నా ఇచ్చినందుకు దాదాపు మూడేళ్ళపాటు కుమారస్వామికి దూరంగా గడిపారు. కానీ 2023 శాసనసభ ఎన్నికలకు ముందు జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ మైసూరులోని జీటీ దేవెగౌడ నివాసానికి వెళ్ళగా కాసేపు ఇద్దరూ కంటతడి పెట్టుకున్నారు. ఆతర్వాత పార్టీలోనే కొనసాగాలని దేవెగౌడ సూచించిన మేరకు పాటించారు. ఇలా జేడీఎస్ ద్వారానే తండ్రీ కుమారులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. జీటీ దేవెగౌడ కుమారస్వామితో మరోసారి విభేదించారు. ఈపరిణామం ఎంత కాలం కొనసాగుతుందనేది చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో కొనసాగి న్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని మైసూరుకు చెందిన వివిధ పార్టీల నాయకులు అభిప్రాయపడుతున్నారు.



బోల్తాపడిన ఆర్టీసీ ఏసీ స్లీపర్ బస్సు

ఆర్టీసీ ఏసీ స్లీపర్ బస్సు బోల్తా

- 13 మందికి గాయాలు

9

పంచ్‌కున్నారు..!





- బెళగావి డీసీసీ బ్యాంకు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మైత్రి
- అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులను పంచుకున్న పార్టీలు
- ఇరు పార్టీల ఒప్పందంపై సర్వత్రా ఆశ్చర్యం

బెంగళూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు నువ్వా, నేనా అని కొట్టుకున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు డీసీసీ ఎన్నికల్లో ఒక్కటై అందరికీ షాక్ ఇచ్చారు. మైత్రి అనే పదం ఎన్నో సందర్భాల్లో రాష్ట్ర, జాతీయ రాజకీయాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో కొనసాగుతుందనేది తెలిసిందే. ప్రస్తుతం అటువంటి పరిణామమే మరోసారి జరిగింది. ఇటు రాష్ట్రంలోను అటు కేంద్రంలోనూ బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య తీవ్రమైన వ్యతిరేకత ఉందనేది తెలిసిందే. కానీ బెళగావి డీసీసీ బ్యాంకు ఎన్నికల్లో మాత్రం ఆ రెండు పార్టీలు కలిసిపోయి అందరికీ ఆశ్చర్యం కలిగించాయి. సంబంధించిన విషయంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్యన మైత్రి ఏర్పడింది. అది కూడా రాష్ట్ర ప్రభుత్వంలోని కీలక మంత్రి సతీష్ జార్కిహోళి సమక్షంలోనే ఒప్పందం కుదిరింది. దీంతో ఎటువంటి వివాదాలకు తావులేకుండా అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నట్లు అయ్యింది. బెళగావి రాజకీయం అంటే రాష్ట్ర ప్రభుత్వం కూడా గడగడలాడే పరిస్థితి ఉంది. 2019లో ఏకంగా ప్రభుత్వాన్ని కూల్చిన విషయం కూడా తెలిసిందే. సోమవారం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు నామినేషన్‌ల దాఖలు ప్రక్రియ జరిగింది. అంతకుముందే డీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌లందరూ సమావేశమయ్యారు. తొలివిడతగా 30నెలల పాటు అధ్యక్షుడిగా బీజేపీ సీనియర్‌నేత అణ్ణాసాహెబ్ జొల్లె, ఉపాధ్యక్ష పదవికి ఎమ్మెల్యే రాజుకాగెలు ఉండేలా తీర్మానించారు. డైరెక్టర్‌లు అప్పాసాహెబ్ కులగోడ, మహంతేష్ దొడ్డగౌడర, గణేష్‌హుక్కేరి, అరవిందపాటిల్, విరూపాక్షమామని, విశ్వాస వైద్య, నానాసాహెబ్ పాటీల, నీలకంఠకప్పలగుద్ది, అమరనాథ జారకహోళి, రాహుల్‌జారకహోళి, చన్నరాజ హట్టిహోళితో పాటు ఇతరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సతీష్‌జార్కిహోళి మాట్లాడుతూ డైరెక్టర్‌లందరి అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయం తీసుకున్నామన్నారు. తొలి రెండున్నరేళ్ల అధ్యక్ష పదవి బీజేపీకి, ఉపాధ్యక్ష పదవి కాంగ్రెస్‌కు దక్కేలా తీర్మానించామన్నారు. తదుపరి అధ్యక్ష పదవి కాంగ్రెస్‌కు ఉపాధ్యక్ష పదవి బీజేపీకి ఉండేలా సమిష్టి నిర్ణయం తీసుకున్నారన్నారు. తీర్మానాలకు అనుగుణంగానే ఇద్దరు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. పోటీ లేకపోవడంతో అధికారికంగా ప్రకటించడమే తరువాయిగా ఉంది. కాగా కాంగ్రెస్‌కు చెందిన లక్ష్మణసవది, మాజీ అధ్యక్షుడు రమేష్‌కత్తి, రామదుర్గ డైరెక్టర్ మల్లణ్ణ యాదవాడతో పాటు ప్రభుత్వం నుంచి నామినేట్ అయిన డైరెక్టర్ అశోకపట్టణ తటస్థంగా ఉన్నారు.



బెళగావి డీసీసీ బ్యాంకు చైర్మన్ అణ్ణాసాహెబ్ జొల్లె



ఉపాధ్యక్షుడు రాజుకాగె



అలంకరణలో లాల్‌బాగ్ సోమేశ్వర స్వామి

శంభో.. శంకర

- కార్తీక సోమవారం సందర్భంగా మార్మోగిన శివనామస్మరణ

కంప్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా ఓంకారం ప్రతిధ్వనించింది. శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. కంప్లి సమీపంలోని నారాయణస్వామి క్యాంపులో కోదండరాం దేవస్థానంలో సుధా మహిళ వివిధ చిత్రాలతో జ్యోతులు వెలిగించడం విశేషంగా ఆకట్టుకుంది.







వివిధ రూపాల్లో దీపోత్సవం

అడుగడుగునా నిఘా..!

- ఢిల్లీ పేలుళ్లతో రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తం ● బెంగళూరు ఎయిర్‌పోర్టు, మెట్రోస్టేషన్ల వద్ద భద్రత పెంపు

బెంగళూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశరాజధాని ఢిల్లీలో భారీ పేలుళ్లతో రాష్ట్ర వ్యాప్తంగా నిఘా వర్గాలు అప్రమత్తం అయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే పోలీసు ఉన్నతాధికారులతో డీజీపీ ఎంఏ సలీం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ప్రధానంగా బెంగళూరు వ్యాప్తంగా ఒక్కసారిగా భద్రత పెంచారు. ప్రధానంగా బెంగళూరు, మంగళూరులలోని అంతర్జాతీయ విమానాశ్రయాల వద్ద సోమవారం రాత్రి 8గంటల నుంచే అదనపు బలగాలను రంగంలోకి దించారు. ఇక బెంగళూరులో అన్ని మెట్రోస్టేషన్‌లు, విధానసౌధ, రాజభవన్, ప్రధానమైన రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లు సహా అధికంగా ప్రజలు చేరే ప్రాంతాలపై నిఘా పెంచారు. ప్రధానంగా మెజిస్టిక్, ఎంజీరోడ్, కెంగేరి, జయనగర్ సహా అన్ని మెట్రోస్టేషన్‌ల వద్ద ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇక నగర వ్యాప్తంగా ఉండే షాపింగ్ మాల్స్ వద్ద కట్టుదిట్టం చేశారు. అనుమానాస్పద వాహనాలపై నిఘా పెంచేందుకు పలుచోట్ల గస్తీ ఏర్పాటు చేశారు. బెళగావి, మైసూరు, విమానాశ్రయాల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇక స్టేడియంలతో పాటు జనసందడిగా ఉండే కేఆర్ మార్కెట్, జయనగర్ 4వ బ్లాక్ సహా సుమారు 50 ప్రాంతాల్లో పోలీసుల బందోబస్తు పెంచారు. అత్యవసర పరిస్థితి కారణంగా సబ్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల దాకా అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకించి పోలీసుస్టేషన్‌లలో అందుబాటులో ఉండాలని డీజీపీ ఆదేశించారు. ఢిల్లీ పేలుడు నేపథ్యంలో దేశవ్యాప్తంగా అప్రమత్తంగా ఉండేలా కేంద్రహోంశాఖ సూచించినట్లు సమాచారం. ఢిల్లీ తర్వాత పలు విభాగాలకు బెంగళూరు కేంద్రంగా ఉన్న తరుణంలోనే అప్రమత్తం చేసినట్లు సమాచారం. ఎయిర్‌ఫోర్స్, మిలటరీ కేంద్రాల వద్ద నిఘా పెంచారు. ఉత్తరకన్నడ జిల్లా కారవారలోని నౌకా కేంద్రంతో పాటు మంగళూరులోని హార్బర్‌ల వద్ద బందోబస్తు పెంచినట్లు సమాచారం.



బెంగళూరు ఎయిర్‌పోర్ట్ వద్ద భద్రతా బలగాలు

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు
కట్టుబడి ఉంటుంది

- డీసీఎం డీకే శివకుమార్



బళ్లారి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా వంద పార్టీ కార్యాలయాలు నిర్మించాలని తల పెట్టిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని జలవనరుల శాఖా మంత్రి, డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. ఆదివారం కూడ్లిగిలో చెరువులకు వదిలే కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. తుంగభద్ర జలాశయంలో నీరున్నా కాలవలకు వదలడం సాధ్యం కాదని, రైతులు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. తుంగభద్రకు నీరు వదిలితే క్రస్ట్‌గేట్లు అమర్చడం సాధ్యం కాదన్నారు. రైతులు సహకరించకపోతే నీటి ప్రాజెక్టుకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్లు అమర్చే విషయంలో నీడబ్ల్యూసీ, రెండు రాష్ట్రాల అధికారులు బోర్డు కమిటీ సమావేశం అయి నిర్ణయం తీసుకుంటారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా 100 కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు నిర్మాణం చేపట్టిందన్నారు. ఇప్పటికే చాలా మంది ఎమ్మెల్యే పార్టీ కార్యాలయం కోసం స్థలాలు ఇచ్చారని, కొందరు ఇంకా ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు.

మైలార్ కర్మాగారం ముందు చెరకు రైతుల నిరసన



చక్కెర ఫ్యాక్టరీ వద్ద పోలీసుల బందోబస్తు

కంప్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హడగలి తాలుకా పరిధిలోని మైలార్ చెరకు ఫ్యాక్టరీ వద్ద సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఉదయమే భారీగా రైతులు అక్కడికి చేరు కున్నారు. చెరకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3,500 చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. రైతులకు పలువురు ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులను నిలువరించలేక గేట్లు మూసేసి వెళ్లిపోయారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్మాగారం ముందు గుమిగూడి ట్రాక్టర్లతో చెరకును లోపలకి తరలించడానికి ప్రయత్నించారు. అక్కడికి చేరుకున్న తహసీల్దార్ సంతోష్ కుమార్, డీవైఎస్పీ సంతోష్ చౌహాన్, సీపీఐ దీపక్ బూసారెడ్డి, ఫ్యాక్టరీ యజమానులతో చర్చించి అరగంటలోపు చెరకు క్రషింగ్‌ను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. చర్చించి న్యాయం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఎలాంటి గొడవలకు దిగరాదని సూచించారు. రైతులను కట్టడి చేయడానికి భారీగా పోలీసుల బలగాలు అక్కడికి చేరకున్నారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు చేపట్టారు. పోలీసుల హామీతో రైతులు శాంతించి తరలిపోయారు.

పోలీస్ అలర్ట్

ఢిల్లీలో పేలుళ్ల నేపథ్యంలో ముమ్మర తనిఖీలు

- బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లలో పెరిగిన నిఘా
- అనంతలో గట్టి భద్రత


అనంతపురం విద్యుత్ నగర్ సర్కిల్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ శ్రీకాంత్


గుత్తి రైల్వే స్టేషన్‌లో రాత్రి 11.30 సమయంలో కాచిగూడ-పుదుచ్చేరి రైలు దిగిన ప్రయాణికులను తనిఖీ చేస్తున్న ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది


గుత్తి పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు


అనంత బస్టాండ్ సమీపంలో త్రీ టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తనిఖీలు


బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ

బీసీ రుణం అయోమయం..!

రుణ యూనిట్లు మంజూరైనా విడుదల కాని నిధులు

పూలే జయంతి రోజున ఆర్భాటంగా చెక్ విడుదల.. నెలలు గడుస్తున్నా.. అందని రుణాలు

- లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- యంత్రాంగం మౌనం..

అనంతపురం విద్య, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. యూనిట్లు మంజూరు చేసి నెలలు గడిచినా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. జిల్లా యంత్రాంగం మాత్రం పూలే జయంతి రోజున చెక్కు విడుదల చేసి.. హంగామా చేసింది. నేటికీ సబ్సిడీ రుణాలు అందక లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. నిధులు ఎప్పుడు విడుదలవుతాయోనని చెప్పేవారు కూడా కరువయ్యారు.


రుణాలకు సంబంధించిన చెక్‌ను విడుదల చేస్తున్న అప్పటి కలెక్టర్ వినోద్‌కుమార్

వైసీపీ హయాంలో నిర్వీర్యం

బీసీ కార్పొరేషన్‌లో బడుగు, బలహీనవర్గాల వారితో పాటు ఆర్థికంగా బలహీనంగా ఉన్న ఓసీలకు ప్రభుత్వం తరపున వివిధ రకాల రుణాలు మంజూరు చేస్తారు. గత వైసీపీ సర్కారు ఇలాంటి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసింది. ఛైర్మన్‌ను నియమించి, వారికి కనీస సౌకర్యాలు కల్పించిన పాపాన పోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేషన్ల ద్వారా పేదోళ్లకు పథకాలు మంజూరు చేసి ఆదుకోవాలని భావించింది. అందులో భాగంగా అనంత జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా వేలాది మందికి బ్యాంకు రుణాలను సబ్సిడీపై మంజూరు చేయాలని చర్యలు చేపడుతోంది. జిల్లా యంత్రాంగం సైతం ఆయావర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించి, యూనిట్లు మంజూరు చేసింది.


బీసీ కార్పొరేషన్ కార్యాలయం

ఆర్భాటంగా చెక్ విడుదల

జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా మొత్తం 2,429 రుణ యూనిట్లు మంజూరు చేశారు. ఇందుకోసం 50శాతం సబ్సిడీతో రూ.52.31 కోట్లు కేటాయించారు. ఇందులో ప్రభుత్వం రూ26.15 కోట్లు ఇస్తే.. బ్యాంకులు అంతే మొత్తంలో రుణాలు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇంతవరకు ఈ యూనిట్లకు డబ్బు మంజూరు కాలేదు.

జనరిక్ మందుల షాపులు.. కుట్టుమిషన్లూ అంతే..

ఈబీసీ కార్పొరేషన్ కింద జిల్లాలో వివిధ వర్గాలకు కలిపి 72 జనరిక్ మందులషాపులను మంజూరు చేశారు. ఇందుకోసం రూ5.76 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇందులో సగం సొమ్ము ప్రభుత్వం ఇస్తే మిగిలిన సగం బ్యాంకులు రుణాల రూపంలో మంజూరు చేస్తాయి. వీటికి పైసా కూడా రాలేదు. అలాగే జిల్లాలో 4,083 మంది మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చారు. వీరందరికీ కుట్టుమిషన్లను బీసీ కార్పొరేషన్ ద్వారా అందించాల్సి ఉంది. ఇప్పటికీ ఒక్క కుట్టుమిషన్ కూడా రాలేదు. చివరకు కుట్టుశిక్షణ ఇచ్చిన సంస్థలకు అందుకు సంబంధించిన బిల్లులు కూడా చెల్లించలేదు. దీంతో ఆయావర్గాలకు ఎదురుచూపులు తప్పలేదు.

అధికారుల అత్యుత్సాహం

బీసీ కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. ఈ ఏడాది పూలే జయంతి రోజున అప్పటి కలెక్టర్ వినోద్‌కుమార్, ప్రజాప్రతినిధులు చెక్ విడుదల చేశారు. ఇప్పటికీ అందుకు సంబంధించిన నిధులు ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. దీంతో లబ్ధిదారులు.. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వారికి ఏం చెప్పాలో అర్థంకాక యంత్రాంగం తలలు పట్టుకుంటోంది.

జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణ యూనిట్లు

పేరు	యూనిట్లు	సబ్సిడీ(రూ.)	బ్యాంకులోను(రూ.)	విలువ(రూ.)
బీసీ కార్పొరేషన్	1,728	16.45కోట్లు	16.45కోట్లు	32.90కోట్లు
ఈబీసీ	102	88.50లక్షలు	88.50లక్షలు	1.77కోట్లు
కమ్మ	58	50.50లక్షలు	50.50లక్షలు	1.01కోట్లు
రెడ్డి	29	25లక్షలు	25లక్షలు	50లక్షలు
వైశ్య	21	18లక్షలు	18లక్షలు	36లక్షలు
బ్రాహ్మణ	14	12లక్షలు	12లక్షలు	24లక్షలు
క్షత్రియ	1	లక్ష	లక్ష	2లక్షలు
కాపు	344	5.77కోట్లు	5.77కోట్లు	11.55కోట్లు
మేదర, కుమ్మర	132	1.98కోట్లు	1.98కోట్లు	3.96కోట్లు
మొత్తం యూనిట్లు	2,429	26.15కోట్లు	2,615కోట్లు	52.31కోట్లు

ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది



కొత్తగా ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నా. కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అవి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమవుతాయి. కుట్టుమిషన్ల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లాం.

-రామసుబ్బారెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ

మీ ఆయన నా జేబులో ఉన్నాడా ?

బాధితురాలిపై ఎస్ఐ హూంకరింపు

న్యాయం కోసం ఎస్పీ కార్యాలయానికి బాధితులు

అనంతపురం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'ఏంటి..! మీ ఆయన నా జేబులో ఉన్నాడా? తెచ్చి ఇవ్వడానికి' ఇదీ ఓ బాధితురాలు స్టేషన్‌కు వెళితే ఎస్ఐ నుంచి వచ్చిన హూంకరింపుతో కూడిన సమాధానం. ఇలా కొందరు పోలీస్ అధికారులు బెదిరింపు ధోరణిలో సమాధానం ఇస్తుంటే... మరికొందరు దివ్యాంగులు అనే కనికరం కూడా చూపడం లేదు. దీంతో స్థానిక స్టేషన్లలో తమకు న్యాయం జరగదని భావించిన పలువురు ఎస్పీ కార్యాలయం మెట్లు ఎక్కుతున్నారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు సోమవారం జిల్లాలోని పలుప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. తర్వాత పలువురు మీడియాతో తమ ఆవేదన వ్యక్తం చేశారు.



మూడు నెలలుగా తిరుగుతున్నా

మూడు నెలలుగా తిరుగుతున్నా గార్లదిన్నె ఎస్ఐ తనకు న్యాయం చేయడంలేదంటూ సంజీవపురానికి చెందిన బాధితురాలు బొగ్గు మంజుల వాపోయారు. తన భర్త భాస్కర్ మూడు నెలల కిందట ఓ అమ్మాయితో వెళ్లిపోయాడని తెలిపారు. ఈ సమస్యపై అడిగేందుకు గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌కు గత మూడు నెలలుగా తిరుగుతున్నానని వాపోయారు. ఎస్ఐ ఏమాత్రం స్పందించడం లేదని, పైగా మీ ఆయన నా జేబులో ఉన్నాడా అంటూ తిడుతున్నాడని ఆమె వాపోయారు. ఎంపీటీసీ విశ్వనాథ్, ఓ అమ్మాయి కుటుంబ సభ్యులతో డబ్బులు తీసుకుని వాళ్లకు అనుకూలంగా మాట్లాడుతున్నారంటూ ఆరోపించారు. తనకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

నా సెల్‌ఫోన్ ఎప్పుడు దొరుకుతుందో?



ఇతడి పేరు ఓబులేసు. తాడిపత్రి ప్రాంతంలోని ఏడిగడ్డపాళెంలోని బంకమట్టి వీధిలో నివాసం ఉంటున్నాడు. పక్షవాతం వచ్చింది. ఒక చెయ్యి పనిచేయదు. పక్షవాతం కావడం వల్ల మూతి సొట్టపోయింది. దీంతో మాట్లాడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తాడిపత్రిలో గత నెల 6న ఆటోలో రూ. 10 వేల విలువైన సెల్‌ఫోన్ పోయిందని తెలిపారు. ఫోన్ పోయిన తర్వాత రోజే తాను తాడిపత్రి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. అయితే 'సెల్‌ఫోన్ దొరికితే చెప్పి పంపుతాం అని పోలీసులు అంటున్నారు. ఎప్పుడు దొరుకుతుందో ఏమో ' అని ఆయన వాపోయాడు.

కంప్లైంట్ ఇస్తే నరికేస్తాం అంటున్నారు..



భూ వివాదంలో తనపై కొడవలితో దాడి చేసిన వారిపై కేసు పెట్టాలని ఐదు సార్లు స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగలేదని మైలారంపల్లికి చెందిన గంగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డే తిరులేసు, ఆయన భార్య కవిత నా పొలంలోనే మామిడి చెట్లు నాటారు. ఆ ఇద్దరితోపాటు శంకరయ్య, సునీత, లక్ష్మిదేవి కలిసి నా మీద దాడి చేశారంటూ వాపోయారు. పైగా కంప్లైంట్ ఇస్తే నరికేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆమె గగ్గోలు పెట్టారు. వారిపై ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు వాళ్లను స్టేషన్‌లోకి పిలిచి మాట్లాడతారు. తనను మాత్రం స్టేషన్ దగ్గర కూర్చోబెట్టి వెనక్కు పంపుతారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

బాక్సులు మాయం..!

- బస్సుల్లో కనిపించని ఫస్ట్ ఎయిడ్ బాక్సులు
- నిర్వహణను వదిలేసిన ఆర్టీసీ


ఆర్టీసీ బస్సులో ఖాళీగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్

ధర్మవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమని చాలా మంది ప్రయాణికులు భావిస్తున్నారు. బస్సుల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించడం లేదు. బస్సులు ప్రమాదానికి గురైతే ప్రయాణికులకు కనీసం ప్రథమ చికిత్స కూడా లభించడం లేదు. దగ్గరలోని ఆసుపత్రికి రక్తమోడుతూ వెళ్లాల్సిందే. తాత్కాలిక ఉపశమనంగా ఆర్టీసీ బస్సుల్లో గతంలో ప్రథమ చికిత్స పెట్టెల్లో మందులు అందుబాటులో ఉండేవి. వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేయడంతో ప్రయాణికుల భద్రత గాలికి వదిలేసినట్లయింది. రాష్ట్రంలో వరుసగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలోనయినా అధికారులు మేల్కోకపోవడం గమనార్హం. జిల్లాలో ఆర్టీసీ బస్సుల రాకపోకలు పెరుగుతున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మరింత రద్దీ పెరిగింది. బస్సుల వసతులపై అధికారులతో సమీక్షించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లేవనే చెప్పవచ్చు. చాలా బస్సుల్లో మెడికల్ కిట్లు లేవు. ఉన్నా.. చాలా వరకు కాలం చెల్లిన మందులే ఉన్నాయని ప్రయాణికులు అంటున్నారు. అసలు హైదరాబాద్ సర్వీసులోనే ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కనిపించలేదు.



జిల్లాలో పరిస్థితి ఇదీ..

- ఆర్టీసీ డిపోలు : ఆరు
- మొత్తం బస్సులు : 391 బస్సులు
- అద్దె బస్సులు : 119
- పల్లె వెలుగు బస్సులు : 196
- అల్ట్రా పల్లె వెలుగు బస్సులు : 14
- ఎక్స్‌ప్రెస్ బస్సులు :119
- రోజు తిరిగే కిలోమీటర్లు 1.48 లక్షలు
- రోజు జిల్లాలో ప్రయాణించే ప్రయాణికులు : 1.34 లక్షలు
- ప్రతి రోజూ వచ్చే ఆదాయం: రూ.66.89 లక్షలు

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

మోటారు వాహనాల చట్టం ప్రకారం ఆర్టీసీ, విద్యాసంస్థల బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు తప్పని సరిగా ఏర్పాటు చేయాలి. ఇందులో దూది, కత్తెర, టించర్, అయోడిన్, యాంటిసెప్టిక్ క్రీం, కాటన్ బ్యాండేజీ, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్ వంటివి ఉండాలి. ఆర్టీసీ బస్సుల్లో డ్రైవర్ సీటు వెనకాల ఈ ప్రథమ చికిత్స పెట్టె ఉండాలి. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ పెట్టెలో ఉన్న సామాగ్రితో కండక్టర్ ప్రథమ చికిత్స చేయాలి. జిల్లాలోని బస్సుల్లో చాలా వరకు ప్రథమ చికిత్స పెట్టెలు కనుమరుగయ్యాయి. కొన్ని బస్సుల్లో పెట్టెలున్నా మందులు ఉండటంలేదు. అందులో డ్రైవర్లకు సంబంధించిన సామగ్రి లేదా కండక్టర్లు టికెట్ రోల్స్ పెట్టుకుంటున్నారు.

బాక్సులే కనిపించలేదు



కొన్ని ఆర్టీసీ బస్సుల్లో అసలు ఫస్ట్ ఎయిడ్ బాక్సులే కనిపించలేదు. కొన్ని బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉన్నా అందులో ఏమీ ఉండవు. పేపర్లు, దూది మాత్రమే కనిపిస్తాయి. ఉచిత బస్సు ప్రయాణం వచ్చాక చాలా మంది వృద్ధులు, నడవలేనివారు ఎక్కి, దిగే సందర్భాల్లో గాయపడుతుంటారు. కానీ ఎవరికీ మందులు వేయడం లేదు, కట్లు కట్టడంలేదు. దీనిపై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- బాలయ్య, తాడిపత్రి

ప్రతి బస్సులో ఏర్పాటు చేస్తాం

చాలా బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్లులేవన్నది వాస్తవమే. ప్రతి బస్సుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందజేస్తున్నాం. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న తరుణంలో డ్రైవర్లకు రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా డ్రైవింగ్‌పై ప్రత్యేక సూచనలు తెలియజేస్తున్నాం. ప్రతి రోజూ డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం.

-మధుసూదన్, ఆర్ఎం, ఆర్టీసీ


హైదరాబాద్ సర్వీసులో కూడా కనిపించని ఫస్ట్ ఎయిడ్‌బాక్స్

ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉంచాలి



ఆర్టీసీ బస్సుల్లోని ఫస్ట్ ఎయిడ్ బాక్సులో మెడికల్ కిట్లను ఉంచాలి. అసలే ప్రస్తుతం ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది. ఈ క్రమంలో బస్సు ఎక్కే సమయంలో తోపులాటలో రక్తగాయాలయినప్పుడు లేదా బస్సు దిగే సమయంలో డోర్ నుంచి జారి పడినప్పుడు గాయాలయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలో బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉంటే కట్టుకట్టి ప్రథమ చికిత్స చేయించుకోవచ్చు. ఆర్టీసీ అధికారులు బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేయాలి. -చంద్ర, ముదిగుబ్బ

గొర్రెలు, మేకలకు ఆంత్రాక్స్ వ్యాక్సిన్లు

- పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గొర్రెలకు ఆంత్రాక్స్ వ్యాక్సిన్లు వేశామని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్ పేర్కొన్నారు. జిల్లాలోని బొమ్మనహాల్, ఆత్మకూరు, కూడేరు, విడపనకల్లు, తాడిపత్రి మండలాల్లో గొర్రెలు, మేకలు ఆకస్మికంగా మృతి చెందాయన్నారు. ఈ పరిణామంతో ఆంత్రాక్స్ సోకిందన్న అనుమానంతో జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారులు, సిబ్బంది ద్వారా తక్షణమే రక్తనమూనాలు సేకరించామని తెలిపారు. ఆంత్రాక్స్ వ్యాధి బ్యాక్టీరియాను మైక్రో స్కోప్ ద్వారా పరిశీలించి, వ్యాధి సోకినట్లు నిర్ధారించామని వివరించారు. ఆ సమాచారాన్ని సంబంధిత పశు వైద్యాధికారులకు అందజేసి, వ్యాధి సోకిన ప్రాంతాల్లో 5 కిలో మీటర్లలోపు ఉన్న గొర్రెలు, మేకల సంఖ్యను తెలుసుకొని వాటికి వ్యాక్సిన్లు వేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వ్యాధి సోకిన ప్రాంతంలోని గొర్రెలు, మేకల కళేబరాలను జాగ్రత్తగా పూడ్చివేసి, మిగిలిన జీవాలకు సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. ఆంత్రాక్స్ వ్యాధి నిర్ధారణ అయిన మండలాల్లో మిగిలిన ఆరోగ్యకరమైన గొర్రెలు, మేకలకు 35,470 డోస్‌లు వేయించామని తెలిపారు. మరో లక్ష డోసులు సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు.

రేపు అనంతలో ప్రజా ఉద్యమం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12వతేదీ అనంతపురంలో ప్రజా ఉద్యమం పేరుతో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై టవర్‌క్లాక్, లలిత కళాపరిషత్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కూలీలకు అవగాహన కల్పించండి

- వీసీలో కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులకు ఎక్కువ మంది కూలీలు వచ్చేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో పలు అంశాలపై ఆయా శాఖల అధికారులు, ఆర్డీఓలు, ఎస్డీసీలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ శివ్‌నారాయణ్‌శర్మతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని 569 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రస్తుతం డైలీ లేబర్ టర్నవుట్ కింద 17,800 మంది పనులకు వస్తున్నారన్నారు. ప్రతి మండలం నుంచి మరింత ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పనుల కింద కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. జిల్లాలో ఉపాధి పని జరగని గ్రామ పంచాయతీలు ఉండరాదన్నారు. ఉపాధి పనుల్లో విడపనకల్లు మండలం వెనుకబడి ఉందని, ప్రతి రోజు అవగాహన కల్పించి పనుల్లో పురోగతి తీసుకురావాలని ఆదేశించారు. 90రోజుల హౌసింగ్‌లో మరింత పురోగతి తీసుకురావాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మాజీ సైనికులకు ఆయా మండలాల్లో భూమి పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీసీలో కేఆర్సీసీ ఎస్‌డీసీ తిప్పేనాయక్, సీపీఓ అశోక్‌కుమార్, హౌసింగ్ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీమ్‌బాషా, డీపీఓ నాగరాజు నాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కైలాసనాథ అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు

తాడిపత్రి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు కైలాసనాథ అలంకరణలో దర్శనమిచ్చారు. కార్తీకమాసం మూడోవారం కావడంతో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. ఓం నమఃశివాయ అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మారుమ్రోగాయి. సాయంత్రం మహిళలు పెద్దఎత్తున దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.


కైలాసనాథుడిగా స్వామి

గుత్తి మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం కోయంబత్తూరు-మదార్ (వయా గుత్తి) ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోయంబత్తూరు-మదార్ ప్రత్యేక రైలు (నం. 06181) ఈ నెల 13, 20, 27, డిసెంబరు 4 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06182) ఈ నెల 16, 23, 30, డిసెంబరు 7 తేదీల్లో నడపనున్నట్లు వెల్లడించారు. ఈ రైలు తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పట్టి, కాట్పాడి, రేణిగుంట, కడప, యర్రగుంట్ల, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, కాచిగూడ, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ముడ్‌ఖేడ్, నాందేడ్, పూర్ణా, హింగోళి డెక్కన్, వాసిం, అకోలా, మల్కాపూర్, భుసవల్, జల్‌గావ్, పల్ది, నాదుర్బార్, ఎడ్నా, సూరత్, భరుచ్, వడోదర, గోద్రా, రత్లం, జవోరా, మండ్‌సోర్, నీమచ్, ఛత్తీస్‌ఘర్, భిల్వారా, బిజయ్‌నగర్, నాసిరాబాద్, అజ్మీర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని పేర్కొన్నారు.


చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 19టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

దోస్తోయెవ్‌స్కీ (జయంతి)



టాల్‌స్టాయ్‌తో కలసి రష్యన్ స్వర్ణ యుగం నాటి ప్రముఖ రచయిత ఫ్యోదోర్ మిఖైలోవిచ్ దోస్తోయెవ్‌స్కీ 1821 నవంబరు 11న జన్మించారు. తత్వవేత్త, చిన్నకథల రచయిత, వ్యాసరచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. పాత్రికేయుడిగా మానవ సంబంధాలు, మనస్తత్వంతో కూడిన రచనలు చేశారు. ఆయన రచనలు 170కుపైగా భాషల్లో అనువాదమై కోట్లాది కాపీలు అమ్ముడయ్యాయి. ఇది ప్రపంచ సాహిత్యంలో ఒక రికార్డుగా నిలిచింది. 1881 ఫిబ్రవరి 9న కన్నుమూశారు. ఆయన నవలలు రాసిన అపార్ట్‌మెంట్‌ను మ్యూజియంగా తీర్చి 1971లో తెరిచారు.

ఉస్తాద్ కరీంఖాన్ (జయంతి)




శాస్త్రీయ సంగీతంలో కిరానా ఘరానాకు ఆద్యులైన ఉస్తాద్ అబ్దుల్ కరీంఖాన్ 1872 నవంబరు 11న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షమ్లి జిల్లా కిరానాలో జన్మించారు. గాయకుడే కాక వీణ, సారంగి వాద్యాలాపనలో నిష్ణాతులు. మైసూరు ప్యాలెస్‌లో పలు కచేరీలు ప్రదర్శించారు. 'సంగీత రత్న' బిరుదు పొందారు. హిందూస్తానీ సంగీతాన్ని దక్షిణాదికి పరిచయం చేసిన ఘనత ఆయనదే. త్యాగరాజ కృతులకు సంగీతం సమకూర్చారు. 1937 అక్టోబరు 27న కన్నుమూశారు.

ఆచార్య జేబీ కృపలాని (జయంతి)



ఆచార్య జీవత్‌రామ్ భగవాన్‌దాస్ కృపలాని 1888 నవంబరు 11న జన్మించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, రాజకీయ నాయకుడు, పర్యావరణవేత్త. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం 1947లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా, ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 1982 మార్చి 19న కన్నుమూశారు. మరణానంతరం 22ఏళ్లకు ఆయన ఆటోబయోగ్రఫీ 'మై టైమ్స్' విడుదలైంది. 1989లో ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదలైంది.

గోవిందరాజులు సుబ్బారావు (జయంతి)



డాక్టర్ గోవిందరాజులు సుబ్బారావు 1895 నవంబరు 11న జన్మించారు. తొలితరం తెలుగు నాటకరంగ, సినీ రంగ నటుడు. పౌరాణిక, చారిత్రక, సాంఘిక సినిమాలలో నటించారు. ఓవైపు వైద్యం అందిస్తూనే మరోవైపు నటనలోనూ సత్తా చాటుకున్నారు. మాలపిల్లలో సుందరరామశాస్త్రి పాత్రలోనూ, 'బాలనాగమ్మ'లో మాయల మరాఠిగా, పల్నాటియుద్ధంలో బ్రహ్మనాయుడు పాత్రలలో పేరొందారు. 1959 అక్టోబరు 29న కన్నుమూశారు.

జానీ వాకర్ (జయంతి)




ప్రముఖ హాస్యనటుడు జానీవాకర్ 1926 నవంబరు 11న ఇండోర్‌లో జన్మించారు. అసలుపేరు. బద్రుద్దీన్ జమాలుద్దీన్ ఖాజీ. దర్శకుడు గురుదత్ ఆయనకు తాగుబోతు పాత్రకోసం 'జానీవాకర్'గా పేరు పెట్టారు. 300 కుపైగా సినిమాలలో నటించారు. సెక్రటరీ, మేనేజర్ తదితర పాత్రల్లో నటించారు. ఆయనకోసం ప్రత్యేకంగా రాసిన పాటలను మహ్మద్‌రఫీ ఆలపించారు. ఉత్తమ కమెడియన్, సపోర్టింగ్ యాక్టర్ అవార్డులు పొందారు. 2003 జూలై 29న కన్నుమూశారు.

మాడపాటి హనుమంతరావు (వర్ధంతి)



'ఆంధ్ర పితామహ'గా పేరొందిన మాడపాటి హనుమంతరావు 1885 జనవరి 22న కృష్ణా జిల్లా నందిగామ తాలూకా పొక్కునూరులో జన్మించారు. రచయిత, రాజకీయనాయకుడు. ఆంధ్ర జనసంఘం, ఆంధ్రమహాసభ వంటి ప్రజాసంఘాల స్థాపనలోనూ, నిర్వహణలోనూ కీలకపాత్ర వహించారు. 1952లో శాసనసభకు పోటీ చేసి ఓడిపోయారు. హైదరాబాద్ నగరానికి తొలి మేయర్ పదవిని ఆయనే అధిష్ఠించారు. పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. 1970 నవంబరు 11న కన్నుమూశారు.

డాక్టర్ కువెంపు (వర్ధంతి)



కన్నడ రాష్ట్ర గేయం 'జయభారత జననీ తనూజాతె' రచించిన, కన్నడ సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత కుప్పళి వెంకటప్ప పుట్టప్ప (కువెంపు) 1904 డిసెంబరు 29న జన్మించారు. వరకవి బేంద్రె చే 'యుగద కవి జగద కవి'గా పిలవబడ్డారు. సాహితీసేవలకు 'రాష్ట్ర కవి', 'కర్ణాటక రత్న' పురస్కారాలు పొందారు. పద్మ విభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. 1994 నవంబరు 11న కన్నుమూశారు.

బోనీ కపూర్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో పేరొందిన నిర్మాత బోనీకపూర్ 1955 నవంబరు 11న జన్మించారు. ఆయన నిర్మించిన 'మిస్టర్ ఇండియా' సినిమా 100 గ్రేటెస్ట్ ఇండియన్ ఫిల్మ్‌లో ఒకటిగా నిలిచింది. ఆయన రూపొందించిన దాదాపు అన్ని సినిమాలు బాక్సాఫీస్ హిట్ అయ్యాయి. ప్రముఖ నటి శ్రీదేవిని 1996లో పెళ్లి చేసుకున్నారు. బాలీవుడ్‌కు ఎంతోమంది కొత్తనటులను పరిచయం చేశారు.

లియోనార్డో డికాప్రియో (పుట్టినరోజు)



'టైటానిక్' సినిమాతో అంతర్జాతీయ గుర్తింపు పొంది నటుడిగా, నిర్మాత గాను రాణించి, హాలీవుడ్‌లో అత్యధిక రెమ్యూనరేషన్ పొందుతున్న లియోనార్డో డికాప్రియో 1974 నవంబరు 11న లాస్ ఏంజెల్స్‌లో జన్మించారు. బయోపిక్స్‌తో పాటు అసాధారణ పాత్రలలో నటించారు. బాఫ్టా, అకాడమీ, 3 గోల్డెన్ గ్లోబ్ అవార్డ్‌తోపాటు పలు పురస్కారాలు పొందారు. స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి పర్యావరణం సహా సామాజిక సేవలందిస్తున్నారు.

కన్నడ రాజ్యోత్సవాన ఆరోగ్యశిబిరం హర్షణీయం: ఎమ్మెల్యే

బెంగళూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కన్నడ రాజ్యోత్సవం అంటే కొన్నింటే పరిమితం కాకుండా ఆరోగ్యశిబిరం నిర్వహించడం సముచితమని తద్వారా పేదలకు మేలు చేసినట్లు అవుతుందని బసవనగుడి ఎమ్మెల్యే రవిసుబ్రమణ్య అన్నారు. చామరాజపేటలోని జింకేపార్కులో కన్నడ రాజ్యోత్సవ వేడుకలు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగాచిజ. ముఖ్యులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ప్రతినెలా పేదలకు మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. పార్కును సుందరంగా తీర్చామన్నారు. కన్నడ రాజ్యోత్సవం అర్థవంతంగా నిర్వహిస్తున్నారని కమిటీ సభ్యులను కొనియడారు. ఎంపీ పీసీ మోహన్ పాల్గొని రాజ్యోత్సవ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ చన్నేగౌడ, కాంగ్రెస్ నాయకుడు డీసీ రమేష్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఉదయం కన్నడ పతాకాన్ని ఆవిష్కరించి అన్నదానం చేశారు. ఇదే సందర్భంగా పీపుల్స్ ఆసుపత్రితో పాటు ధన్వంతరీ క్లినిక్‌ల వైద్యుల ద్వారా ఆరోగ్య శిబిరం జరిపారు. వందలాది మంది పరీక్షలు జరిపించుకోగా పలువురికి ఉన్నత చికిత్సలకు సిఫార్సు చేశారు. జికెఎఉపార్కు వాకర్స్ కమిటీ ముఖ్యులు మురళి, మంజునాథ్, పరమేష్, జగదీష్, తుళసి, ప్రశాంత్‌లతో పాటు పలువురు మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కన్నడ పతాక ఆవిష్కరణలో ఎమ్మెల్యే రవిసుబ్రహ్మణ్య

హౌస్‌ఫుల్

- రూములకు అడ్వాన్స్ బుకింగ్, లాడ్జులు ఫుల్
- సత్యసాయి జయంతి వేళ గదులకు డిమాండ్

పుట్టపర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి వేడుకలకు లక్షలాది మంది భక్తులు రానుండటం తో పుట్టపర్తిలో లాడ్జిలు, అద్దె గదులకు డిమాండ్ భారీగా పెరిగింది. గత దశాబ్ద కాలంగా ఏమాత్రం ఆదరణ లేని లాడ్జిలు సైతం బాబా జయంతిని పురస్కరించుకుని ఫుల్ అవుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. బాబా జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వము, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేపట్టాయి. సదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పుట్టపర్తిలో ముందస్తుగా రూములకు బుక్ చేసుకుంటున్నారు. ఇప్పటికే చాలా లాడ్జిలలో రూములు పూర్తిగా బుక్ అయిపోయాయి.

100 లాడ్జులు.. 2500 రూములు..

పట్టణంలో దాదాపు 100 వరకు లాడ్జులు ఉన్నాయి. వీటిలో 2500 వరకు రూములు ఉంటాయి. గతంలో జయంతి వేడుకల్లో కొద్ది రోజులు మాత్రమే రూములు పూర్తిస్థాయిలో భక్తులతో నిండి ఉండేవి. నవంబరు 22 లేదా 23 తేదీల్లో మాత్రమే రూములు పూర్తిస్థాయిలో నిండేవి. ఎక్కువ మంది భక్తులు ఆ రెండు రోజులు మాత్రమే పుట్టపర్తికి వచ్చేవారు. అయితే ఈ ఏడు సత్యసాయి శతజయంతి వేడుకలు జరుగుతుండటం ప్రత్యేకతను సంతరించుకుంది. దీంతో వేడుకలకు తిలకించాలని ఎక్కువ మంది భక్తులు ఆసక్తి చూపడంతో రూములకు డిమాండ్ పెరిగింది. గతంలో తరచూ పుట్టపర్తికి వచ్చే భక్తులు ఫోన్ల ద్వారా ఆయా లాడ్జుల యజమానులకు సమాచారం అందించి రూములను కోరుతున్నారు. ప్రశాంతి గ్రామం వద్ద దాదాపు 50 లాడ్జులు ఉన్నాయి. వీటిలో 500 రూముల వరకు అందుబాటు



ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం హాస్పిటల్‌కి వచ్చే పేషెంట్లు నివాసం ఉండేవారు. అయితే ఈ ఏడు శతజయంతి వేడుకలకు వచ్చే భక్తులు హాస్పిటల్ వద్ద సైతం రూములకు బుక్ చేసుకున్నట్లు సమాచారం.

లక్షల్లో భక్తులు.. వేలలో రూములు..

సత్యసాయి శతజయంతి వేడుకలకు లక్షల్లో భక్తులు వస్తారన్న అంచనాలు ఉన్నాయి. దాదాపు 120 దేశాల నుంచి భక్తులు సత్యసాయి శతజయంతి వేడుకలకు హాజరుకానున్నారు. మన రాష్ట్రం నుంచే లక్ష మందిపైగా భక్తులు వస్తారని అంచనాలు ఉన్నాయి. వీరందరికీ గదులో వసతి కల్పించడం కష్టం. అందుకే వేలల్లో ఉన్న రూములకు డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా నవంబరులో తుఫానులు వచ్చే అవకాశం ఉండటం, వర్షం వస్తే చిత్తడిగా ఉండి, చలిగాలులకు ఇబ్బంది పడతామన్న ఉద్దేశ్యంతో అనేక మంది అడ్వాన్స్ పేమెంట్ కట్టి రూములను రిజర్వ్ చేసుకుంటున్నారు. దీంతో రూములకు డిమాండ్ పెరిగింది.

ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్

- పుట్టపర్తిలో 2.0 ఎన్టీఆర్ నగర్
- మంత్రి మండలి ఆమోదం

పుట్టపర్తి, నవబంరు 10(ఆంధ్రజ్యోతి): పట్టుకేంద్రం ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటు దిశగా కీలక అడుగు పడింది. చేనేత క్లస్టర్‌కు భూ కేటాయింపులకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో సోమవారం 35వ మంత్రివర్గం సమావేశం జరిగింది. జిల్లాకు సంబంధించి సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ధర్మవరం మార్కెట్ యార్డు ప్రాంగణంలో చేనేత మెగా క్లస్టర్ ఏర్పాటుకు సర్వే నంబర్ 65లో 9.84 ఎకరాల భూమిని కేటాయించారు. నెలకు రూ.10 వేలు అద్దె చెల్లించేలా 25 ఏళ్లపాటు చేనేత, జౌళి శాఖకు ఈ భూమిని కేటాయించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 కింద ఎన్టీఆర్ నగర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. దీని కోసం పుట్టపర్తి మండలం నిడిమామిడి గ్రామంలో 100 ఎకరాల భూమిని ఏపీ టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్‌కు ఎకరం రూ.1,89,1769 ప్రకారం కేటాయించారు. ఈ మొత్తాన్ని 2025-26 నుంచి 2029-30 వరకు ఐదు వార్షిక వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు కల్పించారు.

చేనేతల సంబరాలు

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న మెగా చేనేత క్లస్టర్ ఆమోదంపై ధర్మవరం చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. విజయవాడలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ చాంబర్‌లో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌కు భూమి కేటాయింపునకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం సంతోషకరమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి సత్యకుమార్‌యాదవ్‌లకు మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ అంబటి అరుణశ్రీ, చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారాఘవ, జింకా పురుషోత్తం, నాగూర్‌హుస్సేన్, షేక్‌చంద్ర, కొత్తపేట ఆది, కేశగాళ్ల శీన, సాయికృష్ణ, బీజేపీ నాయకులు అంబటి సనత్, సాకే ఓబులేసు, ఆదినారాయణయాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ.. ~~హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌కు భూ~~మి కేటాయింపు చారిత్రాత్మక మన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చేనేత పునరుజ్జీవానికి దోహదం చేస్తుందన్నారు. క్లస్టర్ స్థాపనతో వేలాది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు.



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ధర్మవరం చేనేత ప్రముఖులు

భయం..భయం

- రైల్వేస్టేషన్‌లో భద్రత కరువు.. పురం స్టేషన్‌లో పట్టపగలే చోరీలు



హిందూపురం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం

హిందూపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన హిందూపురం రైల్వే స్టేషన్‌లో భద్రత డొల్లగా మారింది. తరచూ జరుగుతున్న చోరీలు, దోపిడీలతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక్కడ ఉన్న రైల్వే స్టేషన్ అలంకారప్రాయంగా మారిందనే విమర్శలు వినవస్తున్నాయి. పట్టుగూళ్లు, చింతపండు మార్కెట్లు ఉండటం, చేనేత మగ్గాలు వేలాదిగా ఉండటంతో ప్రజలు, వ్యాపారులు ఇక్కడకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రైల్వే స్టేషన్‌లో భద్రత కొరవడటంతో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. జరుగుతున్న సంఘటనలతో ప్రయాణికులు ప్లాట్‌ఫాం మీద వేచి ఉండటానికి జంకే పరిస్థితి వచ్చింది. హిందూపురం రైల్వేస్టేషన్ పట్టణం మధ్యలో ఉంటుంది. రైల్వే స్టేషన్‌లో చోరీకి పాల్పడేవారు పోలీసులు అక్కడకు చేరుకునేలోపు ఉడాయిస్తున్నారు. అసలు రైల్వేస్టేషన్‌లో పోలీసులు కనబడటమే గగనం. రైల్వేస్టేషన్‌లో పనిచేసే సిబ్బంది ఏదో చుట్టుపుచూపుగా వచ్చి వెళ్తుంటారనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే సిబ్బంది ఏ ఒక్కరూ యూనిఫాం ధరించరు. ప్లాట్‌ఫాంపై తిరగరు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది కొందరు చాలా ఏళ్లుగా పాతుకుపోవడంతో వారికి కొంతమంది అసాంఘిక శక్తులతో సంబంధాలున్నట్లు ఆరోపణలున్నాయి. అందువల్లే దుండగులు పోలీస్‌స్టేషన్ సమీపంలోనే చోరీలకు తెగబడుతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రైల్వే పోలీస్ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఆడిందే ఆట పాడిందేపాటగా తయారైంది.

కనిపించని సీసీ కెమెరాలు

హిందూపురం రైల్వే స్టేషన్‌లో ఇప్పటివరకు సీసీకెమెరాలు ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నారు. నత్తనడకన సాగుతున్న ఈ పనులు పూర్తయితే సీసీకెమెరాలు ఏర్పాటు చేస్తామని రైల్వే అధికారులు అంటున్నారు. సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని రైల్వే పోలీసులు పలుమార్లు రైల్వే అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

- నాలుగు నెలల కిందట మడకశిర ప్రాంతానికి చెందిన దంపతులు సాయంత్రం ఏడు గంటల సమయంలో హిందూపురం రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ఇద్దరు గుర్తుతెలియని దుండగులు వారి వద్దకు వచ్చి రూ.10వేలు నగదును ఎత్తుకెళ్లారు. మహిళ మెడలో బంగారు గొలుసు లాగేందుకు ప్రయత్నించగా భర్త కేకలు వేయడంతో పరారయ్యారు.
- ఈ ఏడాది జూలైలో రాత్రి 12గంటల సమయంలో రైలు దిగి ఆటో కోసం ప్లాట్ ఫాం మీద వేచి ఉన్న చిత్తూరు ప్రాంతానికి చెందిన ఓవ్యక్తిని బెదిరించి బంగారు గొలుసు, రూ.40వేలు గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. ఆయన వ్యాపారి కావడం, పైగా చిత్తూరు జిల్లా కావడంతో ఇక్కడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండదని వెళ్లిపోయాడు.
- సెప్టెంబరులో ఉదయం 5-30ప్రాంతంలో రైలుకోసం పరిగికి చెందిన ఇద్దరు స్నేహితులు ప్లాట్‌ఫాంపై కూర్చుని ఉన్నారు. వారివద్దకు ముగ్గురు గుర్తుతెలియని దుండగులు వచ్చి చేతిలో ఉన్న ఉంగరం, రూ.5వేలు నగదు లాక్కెళ్లారు. బాధితులు కేకలు వేసేలోపే బియ్యం గోదాములవైపు పరుగులు తీశారు.
- రెండ్రోజుల కిందట రైల్వేశాఖలో పనిచేసే ఓ మహిళ 1వ నంబరు ప్లాట్‌ఫాం మీద మధ్యాహ్నం 12గంటల సమయంలో ఉండగా గుర్తుతెలియని దుండగులు వచ్చి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటన రైల్వే పోలీస్‌స్టేషన్‌కు వంద మీటర్ల దూరం ఉండటం గమనార్హం. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి చోరీలు, దోపిడీలు హిందూపురం రైల్వేస్టేషన్‌లో తరచూ జరుగుతూనే ఉన్నాయి.

6న ఉచిత కృత్రిమ అవయవాల అమరిక

బెంగళూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'భగవాన్ మహావీర్ జైన్ వికలాంగ్ సహాయ సమితి' ఏటా బెంగళూరులో ఉచితంగా కృత్రిమ అవయవాల అమరిక శిబిరం నిర్వహిస్తోంది. అందులో భాగంగానే రానున్న డిసెంబరు 6వతేదీ శనివారం బెంగళూరు నగరం జయనగర్ పరిధిలోని అశోకపిల్లర్ సమీపాన ఉండే మహావీర్ అగ్రసేన్ భవన్‌లో శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా శిబిరం కొనసాగుతుందన్నారు. కృత్రిమంగా ఎటువంటి అవయవాలు అవసరమైనా వారికి అవసరమైన కొలతల ప్రకారం సమకూరుస్తామమని నిర్వాహకులు తెలిపారు. శిబిరం బెంగళూరులో నిర్వహించినా సమీపంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల పరిధికి చెందినవారు పాల్గొనవచ్చునన్నారు. కృత్రిమ అవయవాలు అమరిక ప్రక్రియ పూర్తిగా ఉచితమని ఎవరూ ఎటువంటి సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సాధ్యమైనంత త్వరగా శిబిరానికి చేరుకోవడం ద్వారా ముందుగా పరికరాలు పొందే వెసలుబాటు ఉందన్నారు. ఎటువంటి సందేహాలు, సలహాలకైనా సందీప్ పొద్దార్ 8792288404 రింకేష్ బరోలియా 9886521885ను సంప్రదించవచ్చని వారు ప్రకటనలో తెలిపారు.

14 నుంచి మురుఘేంద్ర జయంత్యుత్సవాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న వివిధ మఠాధిపతులు

బెంగళూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అథణి మురుఘేంద్ర శివయోగి జయంత్యుత్సవాలు బెంగళూరు విజయనగర్ హంపి క్రీడామైదానంలో ఈనెల 14నుంచి బసవోత్సవాల పేరుతో మూడురోజులపాటు నిర్వహిస్తున్నట్లు గచ్చిన మఠ శివబసవ మహాస్వామి తెలిపారు. సోమవారం బెంగళూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బసవణ్ణ వచనాల ద్వారా ప్రజాచైతన్యం తీసుకువచ్చిన వారిలో అథణి స్వామీజీ ఒక్కరన్నారు. మూడురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పత్రికా సమావేశంలో మాదార చెన్నయ్య గురుపీఠం మాదార చెన్నయ్య స్వామీజీ, కుంచిటగ సంస్థానం శాంతవీర స్వామీజీ, చెన్నమల్లికార్జున స్వామీ, తిప్పరుద్ర స్వామీజీ, బసవతత్వ పరిషత్ అధ్యక్షులు అరుణ్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అరకొర బస్సులతో ప్రయాణికులకు ఇబ్బందులు



బస్సు ఎక్కడానికి ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

తోరణగల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు పారిశ్రామిక ప్రాంతమైన తోరణగల్లు ప్రాంతంలో పలు ప్రాంతాల నుండి హోస్పేట, సండూరు తదితర ప్రాంతాల నుండి పెద్దఎత్తున కార్మికులు ఇతర ప్రయాణికులు పనిచేయడానికి వస్తున్నారు. సాయంత్రం పనులు ముగించుకుని వెళ్లడానికి బస్సులు సరిగా అందంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు ఎక్కువై ఫుట్‌పాత్ మీద ప్రయాణాలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం వేళల్లో బస్సులు ఎక్కువ వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే రష్ ఎక్కువగా వుండటంతో ప్రయాణికులు ఫోన్లు మొదలగునవి మిస్ అవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అందువలన సాయంత్రం బస్సులు ఎక్కువ వేయాలని అధికారులను కోరుతున్నారు.

మినీ ఒలింపిక్స్ బాక్సింగ్‌లో

రాణించిన రచిత్, పరిణీత



గోల్డ్‌మెడల్ విజేత రచిత్‌తరుణ్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

బెంగళూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మినీ ఒలింపిక్స్‌లో భాగంగా జరిగిన బాక్సింగ్ పోటీల్లో రచిత్‌తరుణ్, పరిణీతలు రెండు కేటగిరిల్లో బంగారు బహుమతులు సాధించారు. రచిత్‌తరుణ్ 58-60 కేజీల విభాగంలో మూడు పోటీలలోను గెలుపు సాధించారు. విద్యార్థిని పరిణీత 50-55 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. రాష్ట్ర క్రీడలు, యువజనుల విభాగం ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. కాగా బాక్సింగ్ పోటీలలో బంగారు బహుమతులు సాధించిన ఇద్దరికీ రాష్ట్ర ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజు, కేఏబీఏ డాక్టర్ మంజేగౌడ, సాయిసతీష్, ధనసంజయన్‌లు ఇద్దరు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.



పరిణీత



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.33	1631.86
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,158	7,264
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,615	10,069
నీటి నిల్వ (టీఎంసీలు)	77.58	101.23

13న జాతీయ లోక్ అదాలత్

● న్యాయాధికారి రాజేశ్ హొసమనె



బళ్లారి సిటీ,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 13న నగరంలోని తాలూరు రోడ్డులోని కొత్త జిల్లా కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని న్యాయాధికారి రాజేశ్ హొసమనె తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బళ్లారి, విజయనగరం జిల్లాల్లోని మొత్తం 31కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. బాధితులు ప్రీ-లిటిగేషన్ కన్సిలేటియేటబుల్ క్రిమినల్ కేసులు, చెక్కుబౌన్స్ కేసులు, బ్యాంకు కేసులు,మోటారు వాహన ప్రమాద పరిహార ట్రిబ్యునల్ కేసులు వైవాహిక,కుటుంబ కేసులు, ఇతర కన్సిలియేటబుల్ కేసులను త్వరగా పరిష్కరించుకుని ఉపశమనం పొందవచ్చన్నారు. మెగా లోక్ అదాలత్ కు సంబంధించిన సన్నాహక సమావేశాలు ప్రతిరోజు అన్నికోర్టులలో జరుగుతున్నాయని, మరిన్ని వివరాలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ లేదా 08392-278077 నెంబర్‌కు సంప్రదించవచ్చన్నారు. హెల్ప్‌లైన్ నంబరు 15100కు కాల్ చేయవచ్చు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిత్యం కోర్టుల చుట్టూ తిరుగుతూ ధనం, సమయం వృథా కాకుండా లోక్అదాలత్ నిర్వహించాలని నిర్ణయిం చామన్నారు. ఇంది పేదలకు ఎంతో ఉపయోగ కరమన్నారు. ప్రజలు సత్వర న్యాయంపొంది కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

కళాశాల వేళకు బస్సులు నడపాలి

● అరకొర సర్వీసులతో విద్యార్థులకు ఇబ్బందులు: ఏఐడీఎస్ఓ డిమాండ్ ● నగరంలో భారీ నిరసన



రవాణా శాఖాధికారికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ కళాశాల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని ఏఐడీఎస్ఓ డిమాండ్ చేసింది. సోమవారం నగరంలోని సంఘం సర్కిల్ సమీపంలో సభ్యులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్ మాట్లాడుతూ యెత్తినబూదిహాళ్, బుర్రనాయకనహళ్ళి, చారుకుంటే గ్రామాల విద్యార్థులు వేళకు బస్సు అందుకోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. 8గంటలకు వచ్చే బస్సు 8-30 వస్తుంది. విద్యార్థులు ప్రతిరోజు ఉదయం 10గంటలకు బళ్లారికి చేరుకుంటే పాఠశాలలు , కళాశాలలకు ఎలా వెళతారని ప్రశ్నించారు. సాయంత్రం 5-30గంటలకు వచ్చే బస్సులు సమయపాలన పాటించకపోవడంతో పాఠశాల విద్యార్థులు సమయపాలన పాటించలేకపోతున్నారు. దీని వల్ల విద్యార్థులకు చదువులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విద్యార్థుల ప్రయోజనార్థం కళాశాలలు, పాఠశాలల వేళలకు బస్సులు నడపాలని కోరారు. నిరసన స్థలానికి చేరుకున్న అధికారులు అభ్యర్థనను అంగీకరించి, రెండు రోజుల్లో బస్సు సమయానికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లాధ్యక్షుడు కే.ఈరన్న, ఉపాధ్యక్షురాలు శాంతి, విద్యార్థులు శిల్ప, సందీప్, దిలీప్‌లతో పాటు మూడు గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా టిప్పుసుల్తాన్ జయంతి



జయంతి వేడుకలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు హమీద్

సిరుగుప్ప, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టిప్పుసుల్తాన్ బ్రిటీషర్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ధీరుడని టిప్పుసుల్తాన్ సంఘం అధ్యక్షులు హమీద్ ప్రశంసించారు. సోమవారం సిరుగుప్ప పట్టణంలో 223వ టిప్పుసుల్తాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిప్పుసుల్తాన్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హమీద్‌సాబ్ మాట్లాడుతూ మైసూరు పులిగా పేరుప్రఖ్యాతలు దక్కించుకున్న వ్యక్తి టిప్పుసుల్తాన్ విశేష దేశభక్తుడని అన్నారు. దేశం కోసం బ్రిటీషర్లతో పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా టిప్పుసుల్తాన్ సంఘం పదాధికారులు ఫారుక్ సాబ్, సుభాన్, వలీసాబ్, మహమ్మద్ , నగరసభ మాజీ కౌన్సిలర్ చలవాద్ ఉద్దీన్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఓబవ్వ జయంతికి ఏర్పాట్లు చేయండి

● తహసీల్దార్ గౌసియా బేగమ్



సిరుగుప్ప, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒణికే ఓబవ్వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా ఆచరించాలని తహసీల్దార్ గౌసియాబేగమ్ పిలుపునిచ్చారు. ఒణికే ఓబవ్వ జయంతి వేడుకల సందర్భంగా హైస్కూలు గ్రౌండ్ నుంచి నేతాజీ వ్యాయామశాల వరకు ఆమె చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం నేతాజీ వ్యాయామశాలలో వేదిక కార్యక్రమాన్ని చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బీఎం నాగరాజు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తున్నారు. కావున ఈ కార్యక్రమానికి వివిధ సంఘ సంస్థల పదాధికారులు, ప్రభుత్వ శాఖాధికారులు, చలవాది మహాసభ పదాధికారులు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



వాహనాలను నిలిపేసిన అధికారులు

తనిఖీలతో వాహనదారులకు ఇబ్బందులు

● హంపిలో అధికారులపై మండిపడుతున్న పర్యాటకులు

బళ్లారి సిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పర్యాటక క్షేత్రం హంపిలోని స్మారకాలను సందర్శించి విశేష అనుభూతి పొందాలనుకున్న పర్యాటకులకు అసౌకర్యాలు ఓ వైపు, అధికారుల తనిఖీలు ఓ వైపు చుక్కలు చూపిస్తున్నాయి. తరచూ రవాణాశాఖ అధికారులు గంటలకొద్దీ నిలబడి ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాణి స్నాన గృహ సమీపంలో ప్రాంతీయ రవాణా కార్యాలయం (ఆర్‌టీఓ) సిబ్బంది తనిఖీలు చేపట్టడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ముఖ్యంగా పాఠశాల పిల్లలతో నిండిన బస్సును తనిఖీ నెపంతో 20నిముషాలకు పైగా నిలిపివేశారు. గెజ్జల మంటపం వద్ద పార్కింగ్ స్థలానికి వచ్చిన ఆర్‌టీఓ సిబ్బంది అక్కడ వాహనాలను తనిఖీ చేస్తూ కనిపించారు.దీంతో పర్యాటకులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. గతంలో స్మారక చిహ్నాల దగ్గర పోలీసు శాఖ ఇలాంటి తనిఖీలు నిర్వహించింది. తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో వారి తనిఖీలను హంపి ప్రవేశ కేంద్రాలకు మార్చారని ప్రజలు పర్యాటకులు తెలిపారు. ప్రయాణికులు ఇబ్బందులను గమనించి అధికారులు తనిఖీల ప్రాంతాన్ని మార్చాలని వారు కోరుతున్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి



శివమణి

బళ్లారిరూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బళ్లారిరూరల్ తాలుకా గోడేహాళ్ సమీపంలోని తిరుమల పాఠశాల విద్యార్థి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికర్యారు. పాఠశాలకు చెందిన శివమణి వంద మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానం, 80ఆర్డర్స్ పరుగు పందెంలో రాణించి తాలుకా క్రీడా పోటీల్లో అగ్రస్థానంలో నిలిచాడు. దీంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ యల్లప్ప, హెచ్ఎం నాగరాజు, పీటీ టీచర్ ఇషాక్ విద్యార్థిని అభినందించారు.

ఆర్టీసీ ఏసీ స్లీపర్ బస్సు బోల్తా

రాయచూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాయచూరు నగర సమీపం సాథ్‌మైల్ క్రాస్ వద్ద ఆదివారం రాత్రి ఆర్టీసీ ఏసీ స్లీపర్ కోచ్ బస్సు ఒకటి బోల్తా పడింది. హొస్పెట్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఈ బస్సు రాయచూరు సమీపం సాథ్‌మైల్ క్రాస్ వద్ద అదుపు తప్పడంతో ఒక్కసారిగా రోడ్డు దిగి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రతాప్ సింగ్‌కు తీవ్ర గాయాలు కాగా ఎచ్.ఎం.స్వప్న, వీరేశ్, ఉషా, మంజునాథ్, శ్రేయస్, కొట్రప్ప, దీప, లలితా హజారె, రేణుకా, ప్రియాంక, శ్వేత, శారదాబాయిలతో పాటు మొత్తం 13 మంది ప్రయాణికుల గాయాలయ్యాయి. వారిని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు.

ఘనంగా కార్తీకమాస పూజలు

తోరణగల్లు, నవంబరు10(ఆంధ్రజ్యోతి): కురేకుప్ప పట్టణంలోని మార్కండేయ స్వామి దేవస్థానంలో 20 రోజులుగా కార్తీక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం మహాశివుడికి, మార్కండేయ స్వామి, విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫీజు చెల్లింపు తేదీల ప్రకటన

కొత్తచెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు తేదీలను ప్రభుత్వం సోమవారం ప్రకటించినట్లు శ్రీసత్యసాయి జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగపు అధికారి లాజర్ తెలిపారు. ఈ నెల 13 నుంచి 25వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించ వచ్చునన్నారు. ఈ నెల 26 నుంచి డిసెంబరు 3 వరకు రూ.50లు, నాలుగో తేదీ నుంచి 10వరకు రూ.200లు, 11 నుంచి 15 తేదీ వరకు రూ.500 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులు మొత్తం సబ్జెక్టులకు రూ.125లు, ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60లు చెలించాల్సి ఉంటుందన్నారు. ఏజ్డ్ అభ్యర్థులు రూ.300లు చెల్లించాలని ఆయన తెలిపారు.

పత్రికా భవనం నిర్మించాలని వినతి



అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న కంప్లి పాత్రికేయులు

కంప్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలో పత్రికా భవనం నిర్మాణానికి కృషి చేయాలని తాలుకా పాత్రికేయ సంఘం అధ్యక్షుడు వీరేష్ కోరారు. ఆదివారం బళ్లారి జిల్లాలో జరిగిన పాత్రికేయ సంఘం ఎన్నికల కంప్లి తాలుకా నుంచి కార్యదర్శిగా దేవన్న గౌడ పాటిల్, జిల్లా సమితి సభ్యుడిగా చంద్రశేఖర్ గౌడ ఎన్నిక కావడంతో సోమవారం కంప్లి పట్టణంలో అతిథి గృహంలో వారికి తాలుకా పాత్రికేయ సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. అనంతరం వీరేష్ మాట్లాడుతూ పాత్రికేయులకు ఇళ్లస్థలాలు పాత్రికేయ భవనం పాత్రికేయ పిల్లలకు చదువుకునే వారికి పాఠశాలను కళాశాలలోను ఫీజులు తగ్గించేలా జిల్లాలో జరిగే సమావేశంలో చర్చించి నయం జరిగేలా చూడాలని కోరారు. అనంతరం దేవన్న గౌడ పాటిల్, చంద్రశేఖర్ గౌడ మాట్లాడుతూ తాలుకా పాత్రికేయ సమస్యలు విషయం పై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో కరివిరుపాక్షి, భంగి దొడ్డ మంజునాథ్, యమునప్ప, గాదెలింగ పాల్గొన్నారు.

ముగిసిన పాత్రికేయ సంఘం ఎన్నికలు

● అధ్యక్షుడిగా వీరభద్ర గౌడ.. రాష్ట్ర కార్యకారీ సమితికి బసవరాజ్

బళ్లారి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్యనిరత పత్రకర్తర సంఘం (కా.నీ.పా) బళ్లారి జిల్లా పాత్రికేయ సంఘం అధ్యక్షుడిగా వీరభద్ర గౌడ విజయం సాధించారు. అలాగే రాష్ట్ర కార్యకారీ సమితి సభ్యుడుగా సీనియర్ జర్నలిస్టు, న్యూస్ 18 చానల్ రిపోర్టర్ బసవరాజ్ విజయం సాధించారని ఎన్నికల అధికారి నాగరాజు సోమవారం ప్రకటించారు. బళ్లారి జిల్లా జర్నలిస్టుల సంఘం(కా.నీ.పా) పోలింగ్, కౌటింగ్ ఆదివారం ముగిశాయి.. ఇందులో 95 మంది ఓటర్లకు గాను 93 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా వీరభద్ర గౌడ గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా మగ్గురు గురు శాంత, మల్లయ్య, వాగీష్ గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా నరసింహ మూర్తి కులకర్ణి, ఖజాన్‌జీగా అశోక్ విజయం సాధించారు. అలాగే రాజ్య కార్యకారిణీ సమితీ సభ్యుడుగా బసవరాజు విజయం సాధించారు. మిగిలిన 15 సభ్యులు రేణుకాఆరాధ్య, అమరేశ్, పురుషోత్తమ అంద్యాల, కే. ఎం. మంజునాథ, ఉలిగప్ప, కిన్నరేశ్వర. టీ. శ్రీనివాసులు, ఈరేష్, శివానంద, చంద్రశేఖర గౌడ, సతీష్, నందీష్ కుమార్, శివకుమార్, యర్రిస్వామి మొత్తం 15 మంది సభ్యులు విజయం సాధించినట్లు నాగరాజు తెలిపారు. ఈ ఎన్నికలు ప్రశాంగా జరిగాయని ఆయన తెలిపారు.

హొసూరు జోన్

పిల్లల పార్కును పునరుద్ధరించండి



చంద్రచూడేశ్వర కొండపై శిథిలావస్థకు చేరుకున్న పిల్లల పార్కు

హోసూరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని చంద్రచూడేశ్వర కొండ ఆలయం సమీపంలో ఉన్న పిల్లల పార్కును మెరుగుపరచి పునరుద్ధరించాలని ప్రాంత వాసులకోరారు. హోసూరులోని తేరుపేట కొండపై 1500 సంవత్సరాల పురాతన శివాలయం ఉంది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సహ ఉత్తర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. భక్తులు కూర్చుని విశ్రాంతి పొందేందుకు, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా కార్పొరేషన్ ఆలయానికి సమీపంలో పిల్లల పార్కును ఏర్పాటు చేశారు. హోసూరు నగర ప్రాంతం నుంచి కర్ణాటకలోని అత్తిపల్లి వరకు సందర్శకులు నగర సౌందర్యాన్ని పూర్తిగా ఆస్వాదించడానికి ఈ ఉద్యానవనం నుంచి ఒక పరిశీలన టవర్, బైనాక్యులర్లను ఏర్పాటు చేశారు. ఈపరిస్థితిలో సరైన నిర్వహణ లేకపోవడంతో పార్క్ శిథిలావస్థకు చేరింది. ప్రయాణికులు విశ్రాంతి తీసుకోవడానికి సౌకర్యాలు లేవు. పిల్లలు ఉపయోగించే ఊయలలు, ఆట పరికరాలు దెబ్బతిన్నాయి. పర్వతంపై ఉన్న ప్రహరీ శిథిలావస్థకు చేరింది. బైనాక్యులర్ గది మూసివేశారు. ఇక్కడికి వచ్చే యువకులు ప్రమాదాన్ని గ్రహించకుండా పర్వతంపై నిలబడి నగర ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ సమయంలో కొంచెం కాలుజారినా అగాధంలో పడే ప్రమాదం ఉంది. పార్కును పునరుద్ధరించాలని స్థానికులతో పాటు పర్యాటకులు కోరుతున్నారు.

అన్నుచోళ ప్రాజెక్టు ప్రారంభం



బహుమతులు అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు(కృష్ణగిరి) నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి సోమవారం తిరుచ్చి జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్పుచోళ ప్రాజెక్టును ప్రారంభించారు. అనంతరం ఆరాధన చారిటబుల్ ఆర్గనైజేషన్ నిర్వహించనున్న అన్పుచోళ సెంటర్‌ను కృష్ణగిరి జిల్లా హోసూరులోని దర్గా సమీపంలోని అర్బన్ లైవ్లీహుడ్స్ భవనంలో ప్రారంభించారు. సాంఘిక సంక్షేమం, మహిళా హక్కుల శాఖ కింద పనిచేసే ఈ కేంద్రాలు స్వచ్ఛంద సంస్థల ద్వారా డేకేర్ సహాయం, అవసరమైన వైద్య సంరక్షణ, వినోద కార్యక్రమం తదితర సేవలను అందిస్తాయి. ఈ పథకం 60 ఏళ్లు పైబడిన వారికి ప్రయోజనం చేకూరుస్తుంది. కనీసం 50 మందికి పైగా సహాయం అందిస్తారు. కార్యక్రమంలో హోసూరు సబ్ కలెక్టర్ ఆకృతిశెట్టి, మేయర్ సత్య, ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మాదేశ్వరన్, హోసూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శక్తి సుభాషిణి, కౌన్సిలర్లు, జోనల్ కమిటీ చైర్మెన్లు రవి, తాలూకా కమిషనర్ గుణశివ, ఆరాధన చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటరు సర్వే ఫాం అందజేత



పంపిణీలో పాల్గొన్న అధికారులు

హోసూరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఎంజీఆర్ యూత్ వింగ్ జిల్లా జాయింట్ సెక్రటరీ రంగనాథ్, ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి శూలగిరిలో ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ సర్వే ఫాం అందజేశారు. తమిళనాడు అంతటా(నవంబరు 4) ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించి పోలింగ్ బూత్ అధికారులు మొదట ఇంటింటికి జనాభా లెక్కల ఫాంను పంపిణీ చేసే పని ప్రారంభించారు. కృష్ణగిరి జిల్లా శూలగిరి పంచాయతీ ఎన్నికల పోలింగ్ బూత్ అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ మాజీ మంత్రి కె.పి.మునుస్వామి గురక్కనపాళ్యంకు చెందిన ఎంజీఆర్ యూత్ లీగ్ జిల్లా జాయింట్ సెక్రటరీ రంగనాథ్‌ను ఏజెంట్లకు ఇన్‌చార్జిగా నియమించారు. ఎస్ఐఆర్ పోలింగ్ బూత్ అధికారులతో పాటే అన్నాడీఎంకేకి చెందిన రంగనాథ్ శూలగిరిలోని ముస్లింస్ట్రీట్, వన్నియార్ స్ట్రీట్ సహ ప్రాంతాలలో సర్వే ఫాంలను అందజేశారు.

జాతీయ స్థాయికి ఎంపికైన సత్యశ్రీ

● కుస్తీ పోటీల్లో సత్తా చాటుతున్న గ్రామీణ యువతి ● ఒలింపిక్స్ లక్ష్యంగా అడుగులు



తల్లిదండ్రులతో సత్యశ్రీ

కంప్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : కొప్పళ జిల్లా హోసలింగాపుర (హులిగి) గ్రామానికి చెందిన సత్యశ్రీ కుస్తీ పోటీల్లో రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికు ఎంపికయ్యారు. సరైన శిక్షణ, అవసరమైన సౌకర్యాలు లేకపోయినా యువతి రాష్ట్రస్థాయి కుస్తీ టోర్నమెంట్‌లో మొదటి స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సత్యశ్రీ హొస్పేటలోని ఒసెఫికల్ కాలేజీలో బీబీఎం చదువుతోంది. కర్ణాటక రక్షణ వేదిక యువశక్తి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ విజయ్‌కుమార్ కుమార్తె అయిన ఆమె చిన్ననాటి నుంచి కుస్తీపై ఆసక్తి కనబరుస్తోంది. ఇటీవల హరప్పనహళ్లిలోని ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో ప్రత్యర్థిని ఓడించి రాష్ట్ర స్థాయికి ఎంపికై రాజస్థాన్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. సత్యశ్రీకి అవసరమైన సౌకర్యాలు లేక వారానికి ఒకసారి శిక్షణ ఇచ్చే తన కుస్తీ ప్రాక్టీస్‌కు వెళ్లి శిక్షణ తీసుకుంది. అందువల్ల మైదానంలోని మట్టినేలపై ప్రాక్టీస్ ఆమెకు మరియమ్మనహళ్లికి చెందిన హనుమంత, శివమొగ్గకు చెందిన సంజీవ్, ఇద్దరు శిక్షణ కల్పిస్తున్నారు. వీటి ఆధారంగా సత్యశ్రీ తన ప్రతి విజయ ప్రయాణాన్ని కొనసాగించింది. ఒలంపిక్ కుస్తీ ఆమెకు రోల్‌మోడల్ కొప్పాల్ గవిసిద్దేశ్వర కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ అయిన ఈశప్ప దొడ్డమనే ఆమెకు ప్రేరణ. సత్యశ్రీని మొదట కుస్తీకి పరిచయం చేసిన ఈశప్ప దొడ్డమనే స్థానిక ఓపెన్ ఎయిర్ కుస్తీ టోర్నమెంట్‌తో సహా నాలుగు రాష్ట్రస్థాయి కుస్తీ టోర్నమెంట్‌లలో ఆమె పాల్గొంది. ఆమె ఆనెగొంది మైసూరు ఉత్సవాలలో నిర్వహించిన కుస్తీ టోర్నమెంట్‌లలో పాల్గొని మొదటి బహుమతి గెలుచుకుంది. ఆమెకు సరైన సౌకర్యాలు సరైన శిక్షణ లభిస్తే ఆమె మరింత సాధించడానికి సహాయపడుతుంది. సత్యశ్రీ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాజస్థాన్‌లో జరుగనున్న జాతీయ స్థాయి కుస్తీ టోర్నమెంట్‌లో గెలుపొంది. మొదటిస్థానం సాధించాలని నా గురి అన్నారు. నా తల్లిదండ్రుల ప్రోత్సాహం, నా శిక్షకుల సహాయంతో రాబోయే రోజుల్లో అంతర్జాతీయ ఖ్యాతిని సాధిస్తానని నేను నమ్మకంతో ఉన్నాను అని సత్యశ్రీ చెప్పారు. నా తల్లిదండ్రులు నాపై నమ్మకంతోనే నన్ను కుస్తీ పోటీలకు పంపారన్నారు. నా విజయాలన్నీ వెనక తల్లిదండ్రుల సహకారం మద్దతు వల్లే నేను ఎటువంటి భయం లేకుండా నాపై నమ్మకంతో ఒక అమ్మాయిగా పెరిగాను. నేను ఫెస్టివల్‌లో అబ్బాయిలతో కలసి కుస్తీ మ్యాచ్‌లలో పాల్గొన్నప్పుడు కూడా నా తల్లిదండ్రులు ఎటువంటి వ్యతిరేకత లేకుండా నాకు మద్దతు ఇచ్చారు. ఇలాంటి తల్లిదండ్రులు సహకారం వుండేవరకు ఏ కుస్తీ పోటీలలోనైనా పాల్గొంటారని తెలిపారు. తల్లిదండ్రులు విజయ్‌కుమార్, జయమ్మ, తాత రాములు మాట్లాడుతూ తమ వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ వుంటాయి. మున్ముందు పోటీల్లో గెలుపొంది కుటుంబానికి గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఇలాంటి క్రీడాకారులను ప్రభుత్వాలు గుర్తించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతోంది.



కుస్తీ పోటీలో తలపడుతున్న సత్యశ్రీ



రాష్ట్రస్థాయిలో సాధించిన ట్రోఫీతో..

తమ్ముడిని హత్య చేసిన అన్న

●భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతోనే..

రాయచూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తునాన్నరన్న అనుమానంతో తోడబుట్టిన తమ్ముడినే అన్న హత్య చేశాడు. ఘటన రాయచూరు జిల్లా సింధనూరు తాలూకాలోని వెంకటేశ్వర క్యాంప్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సురేశ్ అలియాస్ సూరిబాబు(38), రాజు అలియాస్ ఎమ్మిరాజు(32) ఇద్దరు స్వయాన అన్నదమ్ములు తమ్ముడు హైదరాబాద్‌లో ల్యాండ్రీ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అన్న సూరిబాబు స్వంత గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం హైదరాబాద్ నుంచి స్వంత గ్రామానికొచ్చిన తమ్ముడు అన్నతో కలిసి రాత్రి పూటుగా మద్యం సేవించారు. తాగిన మత్తులో ఇద్దరు ఘర్షణకు దిగగా మాటల మధ్యలో వదిన ప్రస్తావన రావడంతో తమ్ముడిపై అనుమానం పెంచుకున్న అన్న కొడవలితో తల పై బలంగా బాదాడు. దీంతో తీవ్ర రక్తస్రావానికి గురైన తమ్ముడు రాజు అక్కడికక్కడే కుప్పకూలి పడ్డాడు. విషయం తెలుసుకున్న సింధనూరు రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.